
# సాంకేతిక నైపుణ్యాల్లో.. ఆరు తేరేలా!

ఖమ్మం విద్యా విభాగం, పాల్వంచ, న్యూస్‌టుడే

యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లను ప్రారంభిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఏడాది వ్యవధితో ఆరు కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. పది, ఆపై విద్యార్హతలు కలిగిన వారిని ఆధునిక సాంకేతిక నైపుణ్యాల్లో తీర్చిదిద్దటమే ఏటీసీల లక్ష్యం. ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 172 చొప్పున.. మొత్తం 516 మందికి ఈ ఏడాది ప్రవేశం కల్పించనున్నారు.



'మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్‌లో 40, ఇండస్ట్రియల్ రోబోటిక్‌లో 40, ఆర్టిసన్ యాజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్‌లో 20, రెండేళ్ల కోర్సులైన బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్‌లో 24, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్‌లో 24, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్‌లో 24 సీట్లు ఉంటాయి. కోర్సు పూర్తయ్యాక ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా టాటా, మహీంద్రా వంటి కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయొచ్చు' అని కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ గోనెల రమేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

### అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషినింగ్ టెక్నీషియన్ 1

భారత్ డైనమిక్స్, డీఆర్‌డీఓ వంటి పరిశోధన, అనుబంధ ఉత్పత్తి సంస్థల్లో ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సు. మిషన్ ఆపరేషన్, కంప్యూటర్ ప్రోగ్రాంలు రాయడం, మెషిన్ ట్రబుల్, గేర్ కటింగ్, బోల్ట్ నట్ తయారీ వంటి అంశాలు నేర్పిస్తారు. సీఎన్‌సీ మెషిన్ టెక్నీషియన్, ప్రోగ్రాం డిజైనర్, కోడ్ రైటర్, ప్రొడక్ట్ డిజైనర్ వంటి కొలువులుంటాయి.

### మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్ 2

ఈ కోర్సులో పీఎల్‌సీ, సీఎన్‌సీ ప్రోగ్రామింగ్‌తో పాటు ఆటోమేషన్, సెన్సార్లు, యాక్చుయేటర్లు-కంట్రోలింగ్, రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ప్రాసెస్ కంట్రోల్, మేనేజ్‌మెంట్, నాణ్యత నియంత్రణ అంశాలను నేర్పిస్తారు. వీటితో పాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, న్యూమాటిక్స్-హైడ్రాలిక్స్‌లో మెలకువలు చెబుతారు. ఆటోమోటివ్, ఏరోస్పేస్, ఔషధ, ఆహార శుద్ధి, రసాయన, వస్త్ర, చమురు శుద్ధి రంగాల్లో అవకాశాలు లభిస్తాయి. ఆటోమేషన్ టెక్నీషియన్, ప్రాసెస్ కంట్రోల్ ఇంజినీర్, నాణ్యత నియంత్రణ ఇన్‌స్పెక్టర్, రోబోటిక్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ వంటి ఉద్యోగావకాశాలుంటాయి.

### మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ 3

ఎలక్ట్రికల్ వెహికిల్ ఆర్కిటెక్చర్, బ్యాటరీ నిర్వహణ, పవర్ ఎలక్ట్రానిక్స్, ఛార్జింగ్ సిస్టం, ట్రబుల్ షూటింగ్‌లో శిక్షణ ఇస్తారు. ఎలక్ట్రిక్ వెహికిల్, బ్యాటరీ టెక్నీషియన్, ఈవీ మెయింటెనెన్స్ ఇంజినీర్, సర్వీస్ సెంటర్ మేనేజర్ వంటి ఉపాధి అవకాశాలుంటాయి. ఈవీ, పునరుత్పాదక ఇంధన రంగంలో స్థిరపడొచ్చు.

### బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్) 4

మెకానికల్ డిజైన్, సాలిడ్ వర్క్స్ ఆటోడెస్క్ (సీఏడీ) సాఫ్ట్‌వేర్, సీఏఈ(సాఫ్ట్‌వేర్, ఎనిసిస్, సిములింక్), 3డీ మోడలింగ్-అనుకరణ, వర్చువల్ ధ్రువీకరణ, డిజైన్ ఫర్ మ్యాన్యుఫ్యాక్చరబిలిటీ (డీఎఫ్‌ఎం), రేఖాగణిత డైమన్షనింగ్, టాలరెన్సింగ్ అంశాల్లో నైపుణ్యాలు నేర్పిస్తారు. మెకానికల్ డిజైన్ ఇంజినీర్, వెరిఫికేషన్ ఇంజినీర్, సీఏటీ టెక్నీషియన్, ఎనలిస్ట్, వర్చువల్ టెస్టింగ్ ఇంజినీర్, ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ఇంజినీర్‌గా అవకాశాలుంటాయి.

### ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ 5

చేతివృత్తులు, హస్తకళలు, ఆభరణాలు, వాచ్ మేకింగ్, శిల్పం, నమూనా తయారీ, ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఆటోమేషన్ తదితర రంగాల్లో ఉపాధి కల్పించే కోర్సు. డిజైన్, ప్రెసిషన్ క్రాఫ్టింగ్, ఫినిషింగ్, డిజైన్, విజువలైజేషన్, మెటీరియల్ ఎంపిక, ప్రాసెసింగ్, 3డీ ముద్రణ అంశాల్లో నైపుణ్యాలు నేర్పిస్తారు. మాస్టర్ క్రాఫ్ట్స్‌మాన్, టూల్, డై మేకర్, ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంట్ మేకర్, జ్యువెలరీ-ఫర్నిచర్ డిజైనర్, మేకర్ వంటి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

### ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ 6

పారిశ్రామిక రోబోటిక్స్‌లో ప్రాథమిక భావనలు, ప్రోగ్రామింగ్, డిజిటల్, ఆటోమేషన్, కంట్రోల్ సిస్టం, సెన్సార్ ఇంటిగ్రేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-మిషన్ లెర్నింగ్‌లో ప్రావీణ్యం సంపాదించేలా తర్ఫీదు ఇస్తారు. రోబోటిక్ టెక్నీషియన్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజినీర్, ఆటోమేషన్, పారిశ్రామిక రంగాల్లో నైపుణ్య సిబ్బందిగా రాణించవచ్చు.

## ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి: సీఈఓ

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అందిన దరఖాస్తులు విచారించి అర్హులకు ఓటుహక్కు కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2025, స్వీప్ కార్యక్రమాలు, ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా రూపకల్పనపై సమీక్షించారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వరి, ఎన్నికల విభాగం డీటీ అన్సారీ, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.





## అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి: ఎంపీ



ప్రయాణికుల విశ్రాంతి గదుల్లో పనులపై అధికారులను ఆరా తీస్తున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఖమ్మం రైల్వేస్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ప్రయాణికులు వేచి ఉండే, విశ్రాంతి తీసుకునే గదులను పరిశీలించారు. పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. టైల్స్‌కు సెన్సార్ బోర్డులు, దివ్యాంగులు వెళ్లేందుకు వీలుగా రోప్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఫుట్ ఓవర్ వంతెన, ఎక్సలేటర్, ఎలివేటర్, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. నగరపాలక సంస్థ నుంచి డ్రైనేజీ నిర్మాణంతో పాటు మెరుగైన వ్యవస్థకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీని చూసేందుకు వచ్చిన జనగామ జిల్లా నవాబ్‌పేటకు చెందిన నాగమణి మధుమేహంతో కళ్లు తిరిగి రెండో ప్లాట్‌ఫాం పైనుంచి పట్టాలపై పడిపోయి స్వల్ప గాయాలపాలయ్యారు. ఎంపీ ఆమె దగ్గరికి వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రురాలికి ప్రథమ చికిత్స చేయించి ఆసుపత్రికి తరలించాలని అధికారులకు సూచించారు. ఖమ్మం సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్‌చేసి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం రైల్వేస్టేషన్ మేనేజర్ జీఎన్‌వీ ప్రసాద్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ జాఫర్, ఆర్పీఎఫ్ సీఐ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ చేబ్రోలు మోహన్‌రావు, ఎస్ఎస్ఈ ఎలక్ట్రికల్ రామ్‌నివాస్, ఎస్ఎస్ఈ టెలికాం శ్రీనివాస్, ఎస్ఎస్ఈ ఐడబ్ల్యూ బిశ్వజిత్ చౌదరి, డోర్నకల్ ఏడీఈఎన్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

## 'పాలేరు'కు పెరిగిన ఏటి ప్రవాహం

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరు జలాశయానికి పాలేరు ఏటి ద్వారా వరద ప్రవాహం పెరుగుతోంది. ఏటి పరీవాహక ప్రాంతంలోని వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయానికి సోమవారం సాయంత్రం 880 క్యూసెక్కుల వరద చేరింది. జలాశయానికి ఏటి ద్వారా శనివారం 120, ఆదివారం 200, సోమవారం ఉదయం 680 క్యూసెక్కుల నీరు చేరగా, సాయంత్రానికి ఈ ప్రవాహం 880 క్యూసెక్కులకు పెరిగింది. సోమవారం సాయంత్రమూ వర్షాలు కురుస్తుండటంతో ప్రవాహం మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జలాశయం నీటిమట్టం క్రమేణా పెరుగుతోంది. సోమవారం ఉదయం 19.50 అడుగులున్న నీటి మట్టం సాయంత్రానికి 19.7 అడుగులకు చేరింది.



జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం: 23 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం: 19.70 అడుగులు
నీటి నిల్వ సామర్థ్యం: 2.558 టీఎంసీలు
ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు: 1.995 టీఎంసీ
సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటి చేరిక: 2,226 క్యూసెక్కులు
పాలేరు ఏటి ద్వారా..: 880 క్యూ.
పాలేరు నుంచి ఎడమ కాల్వకు నీటి విడుదల: 2286 క్యూ.
పాలేరు పాత కాల్వకు..: 150 క్యూ.
మిషన్ భగీరథ పథకాలకు..: 135 క్యూసెక్కులు.

### పేదింటి కల..
# సాకారమయ్యేలా..!

ఈటీవీ, ఖమ్మం: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. తొలి విడతలో ప్రతి శాసన సభ నియోజకవర్గానికి 3,500-4,000 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించింది. గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగా లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ ఇళ్ల కమిటీల నియామకాలకు శ్రీకారం చుట్టింది. దీపావళి నాటికి తొలి విడత లబ్ధిదారులను ఎంపిక చేయాలని భావిస్తోంది. ఈమేరకు 'ప్రజాపాలన'లో అందిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అర్హులను గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీలు రంగంలోకి దిగనున్నాయి.

ఉభయ జిల్లాల్లో..
గ్రామ పంచాయతీలు: 1,065
ఖమ్మం నగరపాలికలో డివిజన్లు: 60
ఏడు పురపాలికల్లో వార్డులు: 169

### దీపావళి కానుక..!

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో లక్షలాది దరఖాస్తులందాయి. భారాస హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను సైతం ఈపథకంలోకి చేర్చి లబ్ధిదారులకు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీపావళి నాటికి తొలివిడత లబ్ధిదారులను ప్రకటిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రకటించారు. ఉభయ జిల్లాల్లో 35వేల నుంచి 40 వేల మంది నిరుపేదలకు సొంతింటి యోగం దక్కనుంది. సొంతంగా జాగా కలిగిన ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, ఇతరులకు రూ.5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించనుంది.

క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించేందుకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పరిశీలించనున్నాం. తొలిదఫాలో ఎంపికైన లబ్ధిదారులకు సంబంధించి ఇళ్ల నిర్మాణ పనులు త్వరలోనే మొదలవుతాయి. రెండు పడక గదుల ఇళ్లను సైతం లబ్ధిదారులకు కేటాయిస్తాం. **- ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం కలెక్టర్**

### రంగంలోకి కమిటీలు..

పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియటంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. పల్లెల్లో గ్రామ ప్రత్యేకాధికారి, నగరపాలికల్లో డివిజన్ కార్పొరేటర్, పురపాలికల్లో వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటవుతాయి. ప్రతి కమిటీలో ఏడుగురు సభ్యులుంటారు. ఒక్కో కమిటీకి గ్రామ ప్రత్యేకాధికారి, గ్రామ కార్యదర్శి, స్వయం సహాయక సంఘాల మహిళలు ఇద్దరు, స్థానికులు ముగ్గురు (ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు, ఒక బీసీ, ఇతరులు మరొకరు) ప్రాతినిధ్యం వహిస్తారు. సభ్యులంతా పేద, మధ్యతరగతికి చెందిన వారై ఉండాలి. ఈ కమిటీల ఆధ్వర్యంలో గ్రామ, వార్డు, డివిజన్ సభలు జరుగుతాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను గుర్తించటం, అనర్హులు ఇళ్ల బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేయటం వంటి బాధ్యతలను ఈ కమిటీలకు ప్రభుత్వం కట్టబెట్టింది. లబ్ధిదారులకు జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరిగా ఉండాలి. సొంతింటి జాగా కలిగి పక్కాఇళ్లు లేనివారు ఈ పథకానికి అర్హులు.

## అమరుల త్యాగఫలంతో దేశ ప్రగతికి బాటలు




ఖమ్మం పరేడ్ మైదానంలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, పోలీసు అధికారులు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి స్థాపనకు అమరులైన పోలీసుల త్యాగంతోనే దేశ ప్రగతికి బాటలు పడ్డాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిటీ ఆర్మ్‌డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు తీసుకొచ్చే చట్టాలను నిష్పక్షపాతంగా అమలుచేయటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పోలీసు అమరవీరుల కుటుంబాల వారికి సూచించారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని చెప్పారు. గార్డ్ ఆఫ్ హానర్ పరేడ్ ఇన్‌ఛార్జిగా ఆర్‌ఐ శ్రీశైలం వ్యవహరించారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులుబాసిన 214 మంది అమరవీరుల పేర్లను అదనపు డీసీపీ నరేశ్‌కుమార్ చదివి వినిపించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్ర, ఆదివారాల్లో సైకిల్ ర్యాలీ, శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు ఆదివారం, విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలను ఈనెల 28న, ఓపెన్ హౌస్‌ను 29న నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. అదనపు డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహెమాన్, రఘు, సాంబరాజు, రవి, మల్లయ్య, నర్సయ్య, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేశ్, అప్పలనాయుడు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## దిశ కమిటీ సమావేశానికి నివేదికలతో సిద్ధం కావాలి: కలెక్టర్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశానికి నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు దిశ కమిటీ సమావేశం జరుగుతుందని, పథకాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, చెల్లింపుల తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పొడిశెట్టి శ్రీజ, జడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

**చారిత్రక ప్రాధాన్యం కలిగిన జిల్లా..** ఖమ్మం వివిధ అంశాల్లో చారిత్రక ప్రాధాన్యం కలిగిన జిల్లా అని, క్షేత్రస్థాయిలో నేర్చుకున్న అనుభవం ఉద్యోగ జీవితంలో ఎంతగానో ఉపకరిస్తుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర సర్వీసులకు ఎంపికై శిక్షణ నిమిత్తం వచ్చిన 21 మంది అధికారులు వారం పాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు జిల్లాకు సోమవారం చేరుకున్నారు. వారిని ఐదు బృందాలుగా విభజించి తిరుమలాయపాలెం, సింగరేణి, కామేపల్లి, ఏన్కూరు మండలాల్లో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలకు పంపుతున్నారు. వీరితో కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశమై జిల్లా ప్రత్యేకతలను వివరించారు. శిక్షణ కేంద్రం ప్రాంతీయ మేనేజర్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర సర్వీసుల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజా ఫిర్యాదులు సత్వరం పరిష్కరించండి..** ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆవరణలో వేచి ఉన్న పలువురు వృద్ధులు, దివ్యాంగుల వద్దకు కలెక్టర్ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని అర్జీలు స్వీకరించి పరిష్కార చర్యలకు ప్రతిపాదించారు. అదనపు కలెక్టర్ శ్రీజ, జడ్పీ సీఈఓ దీక్షా రైనా, ఇన్‌ఛార్జి డీఆర్వో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీహెచ్‌డబ్ల్యూ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం సర్వజనాసుపత్రి ట్రైనింగ్ స్కూల్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ(మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) కోర్సును అభ్యసించేందుకు 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుబ్బారావు సోమవారం తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను ఆస్పత్రిలోని ట్రైయినింగ్ స్కూల్‌లో అందజేయాలని సూచించారు.

## ప్రారంభమైన ఫార్మా కౌన్సెలింగ్



కేంద్రంలో నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: టీజీ ఎప్‌సెట్-2024 ద్వారా బీఫార్మసీ, ఫార్మాడి కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ జాకిరుల్లా సోమవారం తెలిపారు. మొదటి రోజు మొత్తం 448 మంది విద్యార్థులు వివిధ స్లాట్లలో నమోదు చేసుకున్నారని వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు 415 మంది హాజరయ్యారని చెప్పారు. మరో రెండు రోజుల పాటు కౌన్సెలింగ్ కొనసాగుతుందన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.



# మిరపలో లద్దె పురుగు

– వైరా, న్యూస్‌టుడే

ఉభయ జిల్లాల్లో పత్తి తర్వాత సాగయ్యే ప్రధాన వాణిజ్య పంట మిరప. ఖమ్మం జిల్లాతో పోల్చితే భద్రాద్రిలో సాగు విస్తీర్ణం అధికం. ఈ ఏడాది పైరు ఆరంభ దశలో వరుస వర్షాలు, వరదలు మొక్క ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతోపాటు కొన్ని రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షాలు పడుతుండటంతో లద్దె పురుగు సమస్య తీవ్రమైంది. దీంతో పంటను లద్దె పురుగు తీవ్రంగా నష్టపరుస్తోంది. సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు.



లద్దెపురుగు ఆశించిన మిరప

**ఇవీ లక్షణాలు**

లద్దె పురుగు లార్వాలు ఆకులకు చిన్న రంధ్రాలు చేసి వాటిని జల్లెడగా మార్చుతాయి. కాపు దశలో మిరప కాయలను ఆశించి, ముచ్చిక వద్ద రంధ్రం చేస్తాయి. శరీర భాగమంతా కాయ లోపలకు వెళ్లి గింజలను, గుజ్జును తినేస్తాయి.

**ప్రభావం ఇలా..** లద్దె పురుగు ఆశించిన పైరులో ఆకులు [illegible] దీంతో అవి సారం కోల్పోతాయి. పంట దిగుబడిపై ప్రభావం పడి ఉత్పత్తి తగ్గిపోతుంది. పండిన పంట నాణ్యత కూడా తగ్గిపోతుంది. ఫలితంగా రైతులు ఎక్కువ మొత్తంలో నష్టపోతుంటారు.

**నివారణ చర్యలు..**

పొలంలో లద్దెపురుగు ఎదిగిన లార్వాలను విషపు ఎరను ఉపయోగించి నివారించుకోవాలి. 5 కిలోల తవుడు, 500 మి.లీ. క్లోర్‌పైరిఫాస్, 500 గ్రాముల బెల్లం మిశ్రమాన్ని తగినంత నీటితో కలిపి చిన్న గుళికలుగా తయారు చేయాలి. వాటిని పొలంలో కలిసేలా చల్లాలి. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలి. పురుగుల నియంత్రణకు థయోడికార్బ్ ఒక గ్రాము లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సకార్బ్ 0.8 మి.లీ. నీటితో కలిపి పిచికారి చేయాలి.

# 32 కుంటల భూమిలో.. ఏడు పంటలతో!

రైతేరాజు

చండ్రుగొండ, న్యూస్‌టుడే

32 కుంటల భూమిలో మునగతోట వేశారు ఆ రైతు. అందులోనే అంతర పంటలుగా వంగ, కాకర, బెండ, టమాట, నేల చిక్కుడు పంటలను సాగు చేస్తూ ఆయన పలువురికి ఆదర్శంగా నిలిచారు. [illegible] ఉపాధి హామీ ద్వారా మునగతోటకు రూ.90 వేలు [illegible] చెందిన కోటయ్యను అధికారులు ప్రోత్సహించారు. విడతలవారీగా నిధులు అందజేస్తున్నారు. మునగ తోట మధ్య ఖాళీగా ఉన్న భూమిలో కూరగాయ మొక్కలు వేయడంతో సేంద్రియ ఎరువులు వాడి వాటిని సాగు చేస్తున్నారు కోటయ్య. ప్రస్తుతం టమాటాలు, బెండకాయలు, వంకాయలు కోతకు వచ్చాయి. చిరు వ్యాపారులు తోటవద్దకే వచ్చి కొనుగోలుచేసి తీసుకెళ్తున్నారు. 32 కుంటల్లో కోటయ్య చేస్తున్న సమీకృత వ్యవసాయాన్ని డీఆర్‌డీవో విద్యాధరరావు ఇటీవల పరిశీలించి అభినందించారు. ఇప్పటి వరకు రూ.లక్షన్నర పెట్టుబడి అయిందని, కూరగాయలతో రూ.50వేల వరకు ఆదాయం పొందినట్లు ఆయన తెలిపారు.



మునగ తోటలో రైతు కోటయ్య

నేను చేస్తున్న చిరు ప్రయత్నానికి నా కుమారుడు వీరభద్రం, కోడలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ముగ్గురం కష్టపడి పనిచేస్తున్నాం. ఆదాయం బాగానే ఉంది. ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడికే వచ్చి కూరగాయలు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు.
- కోటయ్య, రావికంపాడు

## నత్తల బెడద నివారణ ఇలా..!



మిరప మొక్క కాండాన్ని ఆశించిన నత్త..

మిరప తోటల్లో ఈ ఏడాది నత్తల బెడద అధికమైంది. నత్తలు మొక్కల కాండాన్ని ఆశించి కొరికి తింటుండటంతో ఆ భాగంలో కాండం కుళ్లిపోయి మొక్కలు వడబడిపోతున్నాయి. కొన్నాళ్లకు ఎండిపోతున్నాయి. మిరప క్షేత్రాల్లో ఎక్కువ సంఖ్యలో ఇవి ఆశిస్తుండటంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కొందరు నత్తలను కూలీల చేత ఏరించి నివారించుకుంటుండగా, ఇంకొందరు వివిధ రకాల పురుగు మందులను పిచికారి చేస్తున్నారు. నత్తల నివారణ విధానాన్ని కూసుమంచి ఏవో [illegible] వివరించారు. నత్తలు నష్టపరుస్తున్న తోటల్లో మెటాల్డిహైడ్ 2.5శాతం గుళికలు ఒక చదరపు మీటరుకు ఐదు గ్రాముల చొప్పున వాడుకోవడం ద్వారా వీటిని నివారించుకునే అవకాశం ఉందన్నారు. మోనోక్రోటోఫాస్ పురుగు మందులో బియ్యం నానబెట్టి మొక్కల వద్ద చల్లుకోవడం ద్వారా ఆశించిన ప్రయోజనం ఉంటుందన్నారు.
- కూసుమంచి, న్యూస్‌టుడే

## ప్రశ్న జవాబు

**? పెసర వేసి 15 నుంచి 20 రోజులు అవుతుంది. కలుపు నివారణ చర్యలు తెలియజేయండి.**
- అల్లూరి నాగేశ్వరరావు, దొడ్డదేవరపాడు

◆ పెసర పైరు విత్తిన 20 రోజుల్లో వెడల్పాకు కలుపు నివారణకు ఇమజిథాపిర్ 300 మి.లీ. ఎకరాకు లేదా గడ్డిజాతి కలుపు నివారణకు ఎకరాకు 400 మి.లీ. క్విజాలోఫాప్ ఇథైల్ లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ. కలుపు మందులను నేలలో తగు తేమ ఉండేలా చూసుకొని పిచికారి చేసుకోవాలి.

**? పెసర, కందిలో పొగాకు లద్దె పురుగు తీవ్రత ఎక్కువ ఉంది. నివారణ మందులు తెలుపగలరు..**
- యాస వల్లయ్య, వంతగుర్తి

◆ పొగాకు లద్దె పురుగు గుడ్ల సముదాయాన్ని నాశనం చేసుకోవాలి. లద్దె పురుగులు కనిపిస్తే క్లోర్‌పైరిఫాస్ 500 మి.లీ. వేపనూనె ఒక లీటరు కలిపి ఎకరానికి పిచికారి చేసుకోవాలి.


**? ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తిలో కాయలు కుళ్లిపోతున్నాయి. సస్యరక్షణ మందులు వివరించవలెను..**
- మేదురు స్వామి, తొర్లపాడు

◆ తేమతో కూడిన వాతావరణంలో తెగులు ఉధృతి పెరుగుతుంది. తీవ్రతబట్టి 15 రోజుల వ్యవధిలో 10 లీటర్ల నీటికి స్ట్రెప్టోసైక్లిన్ లేదా పోషామైసిన్ లేదా ప్లాంటామైసిన్ ఒక గ్రాముతో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలి.
–మధిర, న్యూస్‌టుడే

**డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త**
**మధిర పరిశోధన స్థానం**

రైతులు తమ సందేహాలను పంపాల్సిన వాట్సప్ నెంబరు:
**76750 50041**

# సాగర్ కాలువలో ట్రాక్టర్ బోల్తా: ఇద్దరి దుర్మరణం



సైదులు



బీమ్‌దేవ్

కొణిజర్ల, న్యూస్‌టుడే: కొణిజర్ల మండలం తనికెళ్ల, బోడియాతండా మధ్య సాగర్ కాలువలో ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వైరా శాంతినగర్‌కు చెందిన భూక్యా సైదులు(50), బానోత్ బీమ్‌దేవ్(45)లు రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో బంధువుల ఇంటి వద్ద ఉన్న ఇనుప చువ్వలు తీసుకొని వచ్చేందుకు ట్రాక్టర్‌లో వెళ్లారు. చీకటి పడటంతో బంధువులు ఈ సమయంలో ప్రయాణం వద్దని వారించినా బయల్దేరారు. ఆ క్రమంలో బోడియాతండా సమీపంలోని ప్రధాన సాగర్ కాలువపై ఉన్న వంతెన వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయి బోల్తా పడింది. స్థానికులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సాగర్, ఎస్సై సూరజ్‌లు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ఘటనలో సైదులు, బీమ్‌దేవ్ ట్రాక్టర్ ట్రక్కు, ఇంజిన్‌లో ఇరుక్కుపోయారు. వారిని తీసేందుకు స్థానికులు, పోలీసులు జేసీబీ సాయంతో గంటన్నరపాటు శ్రమించారు. విషయం తెలుసుకున్న బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. తనికెళ్ల, బోడియాతండాకు చెందిన స్థానికులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మృతుడు సైదులుకు భార్య అచ్చమ్మ, ముగ్గురు కుమార్తెలున్నారు. బీమ్‌దేవ్‌కు భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. సైదులు ఇటీవలే ట్రాక్టర్ కొనుగోలు చేశాడని ఇంతలో ఈ దుర్ఘటన జరిగిందంటూ కుటుంబ సభ్యులు రోదించారు.



సాగర్ కాలువలో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు

## అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

ఖమ్మం నేరవిభాగం, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని పాకబండబజార్‌కు చెందిన పవన్ కళ్యాణ్(25) మద్యానికి బానిసగా మారాడు. రెండేళ్ల క్రితం దమ్మాయిగూడెం పరిధిలోని గుడ్ వే పునరావాస కేంద్రంలో అతడిని చేర్పించారు. చికిత్స అనంతరం కొద్దిగా కోలుకోవటంతో పవన్‌ను కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. 20 రోజుల క్రితం తిరిగి మద్యానికి బానిసగా మారడంతో మరోసారి కేంద్రానికి తీసుకొచ్చి వదిలివెళ్లారు. నాలుగు రోజులకే పవన్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయాడు. ఈ నెల 17న తల్లిదండ్రులు పవన్‌ను తిరిగి కేంద్రానికి తీసుకొచ్చి అప్పగించారు. అప్పటి నుంచి సరిగా భోజనం చేయడం లేదని ఆ కేంద్రం సభ్యులు అతడిని కొట్టారు. ఈక్రమంలో సోమవారం అపస్మారక స్థితికి చేరుకున్న పవన్‌ను నిర్వాహకులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడు. యువకుడి కుటుంబ సభ్యులు చికిత్స కేంద్రం నిర్వాహకుల దాడిలో తమ కుమారుడు మృతిచెందాడని ఆందోళన చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## మానని గాయాలు



ఆగస్టు నెల చివరిలో విరుచుకపడిన భారీ వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. మొక్కలు కొట్టుకుపోవడంతోపాటు పొలాల్లో ఇసుక, రాళ్లు మేటవేశాయి. కొందరు రైతులు మేటలు తొలగించి సాగును కొనసాగిస్తే మరికొందరు అలానే వదిలేశారు. మోరంపల్లిబంజర సమీపంలోని దోమలవాగు వద్ద ఇసుక మేటలు వేసిన పొలాన్ని 'న్యూస్‌టుడే' ఛాయాగ్రాహకంలో బంధించింది.– **బూర్గంపాడు, న్యూస్‌టుడే**

## లాభసాటి పంటలపై దృష్టి సారించాలి: మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు సంప్రదాయ పంటలపై కాకుండా లాభసాటి సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. గుర్రాలపాడులో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ వాతావరణ సమస్యలతో తేమ సమస్య అధికంగా ఉందని, రైతులు ఓపిగ్గా ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. అధిక వర్షాల ప్రభావం దృష్ట్యా ప్రభుత్వం సీసీఐని అప్రమత్తం చేస్తూ రాష్ట్రంలో 44 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పండిన పత్తి పంటను పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రైతులు లాభసాటి ఆయిల్‌పామ్ సాగు దిశగా దృష్టి సారించాలని సూచించారు. సోయాబీన్, పెసర, కందులు, మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెటింగ్ శాఖ రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ శ్రీజ, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ బైరు హరినాథబాబు, ఆర్డీఓ గణేశ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి ఎంఏ ఆలీం, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

దమ్మపేట, వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంతో రైతులకు సంతృప్తికర లాభాలు వస్తున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్‌ను సోమవారం సందర్శించారు.

## ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డు అందుకున్న జీఎం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు సింగరేణి జేకే 5 ఉపరితల గనుల పని ఆధారంగా వచ్చిన 'ఫైవ్ స్టార్ రేటింగ్' అవార్డు, ప్రశంసాపత్రాన్ని సోమవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఇల్లెందు జీఎం జాన్‌ఆనంద్ అందుకున్నారు. బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఓసీల్లో పర్యావరణం పరిరక్షణకు పాటుబడుతూ, రక్షణ చర్యలను ప్రామాణికంగా తీసుకుని రేటింగ్‌లను ప్రకటిస్తోంది. విశిష్టలతో ఉత్పత్తిలో రికార్డులను సృష్టించిన జేకే5 ఉపరితల గనికి 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 'ఉపరితల గనుల' విభాగంలో అరుదైన గుర్తింపు రావడంపై ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి అవార్డు అందుకుంటున్న జీఎం జాన్ ఆనంద్

## ముత్తంగి రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతుడైన రామయ్య తండ్రి చూడముచ్చటగా కనిపించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. దర్బారు సేవను ఘనంగా సాగింది. గుంటూరుకు చెందిన భాష్యం లక్ష్మీప్రసన్న, రామకృష్ణ దంపతులు రాములవారిని దర్శించుకుని మొక్కులో భాగంగా అన్నదానం నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని ఈఓ రమాదేవికి అందించారు. వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు.

## జాతర ఆదాయం రూ.27.17 లక్షలు

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో శ్రీకోటమైసమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల లెక్కింపు రెండో దఫా సోమవారం పూర్తయింది. ఈ ఏడాది మొత్తంగా దుకాణ వేలం, పూజా టికెట్ల విక్రయం కలుపుకొని రూ.27,17,949 ఆదాయం వచ్చినట్లు ఈవో వేణుగోపాలచార్యులు పేర్కొన్నారు. గత ఏడాదికంటే రూ.91,212 ఆదాయం పెరిగిందన్నారు. ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు పాల్గొన్నారు.

## విద్యతోనే నిజమైన ప్రగతి: ఐటీడీఏ పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: విద్యతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థులను అన్ని అంశాలలో తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏలో సోమవారం దర్బారు నిర్వహించి వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను సకాలంలో చేరవేసి వారి ప్రగతికి కృషిచేయాలని సూచించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పట్టాలో పేర్లను మార్చాలని, వ్యవసాయ అవసరాలను తీర్చాలని పలువురు దరఖాస్తులు అందించడంతో వీటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని వినతులు అందాయి. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్డీసీ రవీంద్రనాథ్, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

★ విద్యార్థినులకు చేయూత: ఏన్కూర్ మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన భూక్యా శ్రీవిద్య నీట్ పరీక్ష రాసి ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమెను ప్రోత్సహించేందుకు రూ.50 వేల చెక్కును పీఓ కార్యాలయంలో అందించారు. దుమ్ముగూడెం మండలం కొత్త మారేడుబాక గ్రామానికి చెందిన బుద్దుల కవిత ఐసెట్ పరీక్ష రాసి ఉత్తమ ర్యాంకు సాధించడంతో ఎంబీఏ సీటు పొందింది. ఆమె ఉన్నత చదువుకు రూ.30 వేల చెక్కును పీఓ తన కార్యాలయంలో అందించారు.



ఎంబీబీఎస్ విద్యార్థినికి చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్

## 'శాస్త్రీయ విద్యా సాధనకు పోరాటం'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: దోపిడీ, పీడన లేని సమ సమాజం కోసం, శాస్త్రీయ విద్యా సాధనకు పీడీఎస్‌యూ సుదీర్ఘ కాలంగా పోరాడుతోందని వక్తలు పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్ధ శతాబ్ద ఉత్సవ సభ నిర్వహించారు. తొలుత ఖమ్మం పెవిలియన్ మైదానం అమరవీరుల స్మారక స్తూపం నుంచి వందలాది మంది విద్యార్థులు, పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత నాయకులతో ప్రారంభమైన ప్రదర్శన రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాల వరకు కొనసాగింది. అనంతరం బహిరంగ సభలో వక్తలు మాట్లాడుతూ.. 1972లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి నాయకత్వంలో ఏర్పడిన పీడీఎస్‌యూ విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. అరుణోదయ కళాకారుల నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, పూర్వ విద్యార్థులు సారంగపాణి, లక్ష్మీనారాయణ, ప్రస్తుత ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.క్రాంతి, జి.మస్తాన్, రాజేశ్, ప్రణయ్ పాల్గొన్నారు.





ఖమ్మం నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత నాయకులు

## వీధుల్లో భిక్షాటనపై చర్యలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: వీధుల్లో బాలలను ఎత్తుకొని భిక్షాటన చేస్తున్న వారిపై కలెక్టర్ ఆదేశాలతో జిల్లా మహిళా సంక్షేమాధికారిణి స్వర్ణలత లెనినా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి సభ్యులు, బాలల హెల్ప్‌లైన్ విభాగాల వారు ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్నారు. భద్రాచలం బస్టాండు, రామాలయం, ప్రధాన రహదారిలోని హోటళ్లు, పర్ణశాల ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న అయిదుగురు బాలలను, తమ బిడ్డలతో భిక్షాటన చేస్తున్న మరో తొమ్మిది మంది మహిళలను గుర్తించి శిశుగృహకు తరలించారు. నిబంధనల మేరకు ఐదుగురు బాలలను వసతిగృహానికి తరలించారు. మహిళలతో పాటు ఉన్న 9 మంది బాలలను శిశుగృహలో ఉంచారు. వారి తల్లులను ఆధార్‌కార్డులతో మంగళవారం రమ్మని పంపారు. అనాదిగా భిక్షాటనే తమవృత్తి అని ఆ మహిళలు పేర్కొనడం గమనార్హం. ప్రత్యేక డ్రైవ్‌లో హరికుమారి, అంబేడ్కర్, శేషయ్య, లత, ధరణి, వినోద్, సందీప్ తదితర బృంద సభ్యులు పాల్గొన్నారు.

## దుబయ్‌లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: టామ్‌కామ్ కింద దుబయ్‌లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు చేసేందుకు అర్హులైన తెలంగాణ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 40 ఏళ్ల వయస్సు, మూడేళ్ల టూవీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు అర్హులన్నారు. ఈ నెల 24న ప్రభుత్వ ఐటీఐ(టేకులపల్లి)లో నిర్వహించే ముఖాముఖి అవసరమైన పత్రాలు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు నం.94400 49861, 94400 50951 సంప్రదించాలని సూచించారు.

## పిడుగుపాటుతో రైతు మృత్యువాత



సంగెపు నారాయణ

బోనకల్లు, న్యూస్‌టుడే: పిడుగు పడి ఓ రైతు మృతి చెందిన ఘటన బోనకల్లు మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సంగెపు నారాయణ(55) సాయంత్రం తన పత్తి చేలో పాటు పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులు వచ్చాయి. అదే సమయంలో సమీపంలో పిడుగుపడి అక్కడికక్కడే చనిపోయాడు. రాత్రి 8గంటల సమయంలో అరక ఎద్దులు ఇంటికి రావటంతో నారాయణ వెనక వస్తున్నాడని కుటుంబ సభ్యులు భావించారు. ఎంతసేపటికీ రాకపోవడంతో రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ పొలానికి వెళ్లగా ఒంటిపై కాలిన గాయాలతో విగత జీవిగా పడి ఉన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై మధుబాబు కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి..

పినపాక, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరో ద్విచక్ర వాహనాన్ని వెనకనుంచి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. సీతారాంపురంలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన ప్రవీణ్(26) తన బైక్‌పై ఏడూళ్లబయ్యారం వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

## కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఓ కానిస్టేబుల్ కుటుంబం ఇంట్లో దొంగతనం స్థానిక ఎన్నెస్పీ క్యాంపులో నివసించే హేమతేజ్ అశ్వాపురంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. తన కుమారుడి పుట్టు వెంట్రుకలు తీయించేందుకు శనివారం అన్నవరం బయలుదేరి వెళ్లారు. నగరంలోని టేకులపల్లిలో నివసించే తన సోదరి జయసుధ వారితో వెళ్లారు. ఆమె తన 16 తులాల బంగారు నగలను వీరి ఇంటి బీరువాలో పెట్టారు. అన్నవరం నుంచి ఆదివారం రాత్రి తిరిగి వచ్చిన వారు ఇంట్లో గుర్తుతెలియని దుండగులు నగలతోపాటు, రూ.50 వేలు నగదు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. జయసుధ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

## రూ.56 లక్షలకు వస్త్ర వ్యాపారి ఐపీ

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కూసుమంచి మండలం కోక్యాతండాకు చెందిన పిల్లి శ్రీలక్ష్మి రూ.56 లక్షలకు ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశారు. కేసులో మొత్తం ఏడుగురు రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. ఏడేళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్న పిటిషనర్ శ్రీలక్ష్మి.. వ్యాపారాభివృద్ధి కోసం ప్రతివాదుల వద్ద అప్పులు తీసుకున్నారు. కొవిడ్ తదితర కారణాలతో వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, రుణదాతలకు బాకీలు చెల్లించే పరిస్థితి లేనందున తనను దివాలాదారుగా ప్రకటించాలని కోర్టులో ఐపీ దాఖలు చేశారు.



# చక్కటీ ఆలోచన

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే, ఈనాడు, ఖమ్మం

మహిళా స్వావలంబనకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకొని ఎదుగుతున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మహిళా సంఘాల కోసం వినూత్న ఆలోచన చేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో 'స్త్రీ టీ స్టాల్'లు ఏర్పాటు చేయించనున్నారు. డీఆర్డీఏ అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మహిళలకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత అప్పగించాలని ఆదేశించింది. మరో వైపు 'స్త్రీ టీ స్టాల్స్' సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని హైవే రహదారులు, ప్రధాన రహదారుల వెంట, పట్టణ, మండల కేంద్రాల్లో రద్దీ కూడళ్లు, టైర్ పంక్చర్ దుకాణాల వద్ద, అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో 'స్త్రీ టీ స్టాల్స్' ఏర్పాటు చేయనున్నారు. స్టాల్స్ నమూనాలు కలెక్టరేట్ ఆవరణలో రూపొందిస్తున్నారు. కలెక్టరేట్ వద్ద నిర్మించిన ఆర్టీసీ బస్‌షెల్టర్‌కు అనుసంధానంగా ప్రత్యేకంగా ఇందిర మహిళ టీ స్టాల్ నిర్మించారు. కలెక్టరేట్‌లోని క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను వి.వెంకటాయపాలెంలోని మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించనున్నారు. జిల్లా మహిళా సమాఖ్య, మండల కేంద్రాల్లో మండల మహిళా సమాఖ్యలు, ఆయా గ్రామాల్లో గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల వారికి టీ స్టాల్స్ నిర్వహణ అప్పగిస్తారు. పోటీ లేకుండా ఆయా గ్రామాల్లోని మహిళలకే వాటిని కేటాయించనున్నట్లు అధికారులు చెపుతున్నారు.





స్త్రీ టీ స్టాల్ నమూనాలను సిద్ధం చేస్తున్నారిలా


☛ ఖమ్మంలో మాత్రం కొత్త కలెక్టరేట్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో క్యాంటీన్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో క్యాంటీన్ ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెప్మా ద్వారా మహిళా సంఘాలకు క్యాంటీన్ ఇవ్వనున్నారు.

☛ వైరా, మధిర, సత్తుపల్లి, కూసుమంచి (పాలేరు)లో మండల మహిళా సమాఖ్యల ద్వారా క్యాంటీన్‌లు మహిళా సంఘాలకు కేటాయిస్తారు.

## ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి(హనుమకొండ), న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు సుబేదారి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సుంకరి జ్యోతి బహుమతులు, షీల్డులు అందజేశారు. కబడ్డీలో సుబేదారి ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలిస్తే ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం సంపాదించింది. ఖోఖోలో హనుమకొండ కేడీసీ జట్టు విజేతగా నిలిస్తే ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.

## చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

**ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)**

| పంట పేరు | కనిష్ఠ | గరిష్ఠ | నమూనా |
|---|---|---|---|
| కొత్త పత్తి | 5,500 | 7,000 | 6,700 |
| పెసలు | 4,960 | 7,200 | 6,800 |
| ఏసీ ఎండుమిరప | 10,200 | 19,000 | 16,500 |
| ఎండుమిరప | 9,000 | 16,500 | 15,600 |
| ఏసీతాలుమిరప | 9,000 | 9,200 | 9,100 |
| తాలుమిరప | 8,000 | 9,400 | 9,000 |

# సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

## అధికారుల బృందం పర్యటన


మండల అధికారులతో ఉన్నతాధికారుల బృందం

**కారేపల్లి, న్యూస్‌టుడే:** రాజస్థాన్, దిల్లీ, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలకు చెందిన శిక్షణ ఐఏఎస్ అల్తమాష్ గాజి, ఐపీఎస్ వైభవ్ మీనా, ఐఈఎస్ తేజస్విని, ఐఆర్ఎస్ అనితామీనా, ఐఎఫ్ఎస్ విపుల సింగాల్‌ల బృందం ఆల్యాతండాలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి చేరుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల ఆచారాలు, విధివిధానాలు, గ్రామాల స్థితిగతులపై ప్రజలతో సమీక్షించనున్నారు. ఎంపీడీవో సురేందర్, సూపరింటెండెంట్ రమేశ్ ఉన్నారు.

## 'ప్రభుత్వ భూములు కాపాడాలి'

**ఏన్కూరు:** మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని వివిధ పార్టీల నాయకులు తహసీల్దార్ శేషగిరిరావుకు వినతి పత్రం అందించారు. సోమవారం ప్రజాదర్బార్‌లో సమస్యలు తెలిపారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొవ్వూరి నాగేశ్వరరావు, మోరబోయిన కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కట్టా సత్యనారాయణ, సత్యనారాయణ, భారాస ఇటికాల రాజు, నరసింహారావు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

**సమస్య:** అప్పాయిగూడెం పంచాయతీ పరిధిలోని తండాల్లో చెత్త సేకరణ జరగడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. **- స్థానికుడు**

**సమాధానం:** పంచాయతీ కార్మికులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- సురేందర్, ఎంపీడీవో**
– కారేపల్లి, న్యూస్‌టుడే

✆ మర్లపాడు పాతూరులో రేయింబవళ్లు వీధిదీపాలు వెలుగుతున్నాయి. పంచాయతీపై బిల్లుల భారం, ప్రజలపై పన్నుల భారం పడుతుంది. **భీమిరెడ్డి పుల్లారెడ్డి, మర్లపాడు:**
✔ పరిశీలించి పంచాయతీ సిబ్బందితో సరి చేయిస్తాం. **పుల్లారావు, పంచాయతీ కార్యదర్శి**
– వేంసూరు, న్యూస్‌టుడే

✆ అమ్మపేట క్రాస్‌రోడ్డులోని చేతిపంపు వద్ద ఉన్న ఇంకుడు గుంత చెత్తాచెదారంతో నిండిపోయింది. నీరు భూమిలోకి ఇంకిపోవటం లేదు. **- స్థానికుడు, అమ్మపేట**
✔ ఇంకుడు గుంతలో ఉన్న చెత్తాచెదారం తొలగించటంతోపాటు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటాం. **- వాల్మీకి కిషోర్, ఎంపీఓ** – ముదిగొండ, న్యూస్‌టుడే

## 'సర్వే సమగ్రంగా చేపట్టాలి'

**బోనకల్లు, న్యూస్‌టుడే:** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించిన సర్వేను సమగ్రంగా చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. బోనకల్లు రైతు వేదికలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం వద్దకు వెళ్లి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మధిర ఏడీఏ విజయ్ చందర్‌ని అడ్డుకున్నారు. పంటనష్టం తీవ్రంగా ఉన్నా, సర్వే చేస్తున్నవారు తక్కువ చూపించి రాస్తున్నారని ఆరోపించారు. వాస్తవంగా నష్టపోయిన వారి వివరాలను నమోదు చేయలేదని విమర్శించారు. ఏడీఏ నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేయగా రైతులు ఆందోళన విరమించలేదు. డీఏవోతో ఏడీఏ ఫోన్‌లో మాట్లాడారు. రైతుల వివరాలు తీసుకొని వారి పంటల్ని పరిశీలించాలని డీఏవో సూచించటంతో రైతులు ఆందోళన విరమించారు. సీపీఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు, జిల్లా కమిటీ సభ్యుడు రోషన్‌కుమార్ పాల్గొన్నారు.


బోనకల్లు రైతు వేదిక ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

# ఒక్క గింజా కొనలేదు!

ధాన్యం రాకముందే ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు

చింతకాని, తల్లాడ, న్యూస్‌టుడే

మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యం దళారులపాలు కాకుండా.. మద్దతు ధర ఇచ్చి ఆయా కేంద్రాల ద్వారా నేరుగా కొనుగోలు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. మూడు నియోజకవర్గాల పరిధిలో ఈ ఏడాది 2,04,310 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇప్పటికే 24 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు వారం, పది రోజుల క్రితం ప్రారంభించారు. కానీ ఆయా కేంద్రాల్లో నేటివరకూ ఒక్క గింజ ధాన్యం కొనుగోలు చేయకపోవటం గమనార్హం.


తల్లాడ: నూతనకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (పాతచిత్రం)

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా గ్రేడ్-ఏ రకం క్వింటా వరి ధాన్యం రూ.2320కు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. సాధారణ రకం ధాన్యాన్ని రూ. 2300కు కొనుగోలు చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో పచ్చి వడ్లను క్వింటా రూ.50 తక్కువకే కొనుగోలు చేస్తున్నా రైతులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు.

### కొర్రీలతో అవస్థలు..

కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, తాలు, మట్టి తూర్పార పట్టటం, కొనుగోలు కేంద్రంలోనే వారం రోజులు ఆరబోయాలని చెప్పటం.. ధాన్యం లోడ్ అయ్యే వరకూ రైతులదే బాధ్యత అని కొర్రీలు పెడుతుండటంతో ఆసక్తి చూపటం లేదు. గతంలో కూడా ఇదే పరిస్థితి.

### ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం మూడు నియోజకవర్గాల వ్యాప్తంగా వరి పైరు కంకి, పొట్ట దశలో ఉంది. కనీసం పంటను కోసి, నూర్చి చేతికి వచ్చే సరికి కనీసం నెల రోజుల సమయం పడుతుందని రైతులు భావిస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే సౌలభ్యంగా ఉంటుందని భావిస్తున్నారు

### కేంద్రాల ఏర్పాటు ఇలా..

**మధిర** చింతకాని మండలంలో చింతకాని, నాగులవంచ పీఏసీఎస్ పరిధిలో రెండు, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని వారం క్రితం ప్రారంభించారు. నేటివరకూ మూడుచోట్లా బోణీ కాలేదు. కిలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. ముదిగొండ మండలం చిరుమర్రి, బోనకల్లు, మధిర మండలం సిరిపురంలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి.

**సత్తుపల్లి** అత్యధిక వరి పంట సాగు చేసే తల్లాడ మండలం నూతనకల్, వేంసూరు భీమవరం, పెనుబల్లి కేఎం బంజర, సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం, కల్లూరు మండలం కొర్లగూడెంలో కేంద్రాల ఏర్పాటు

**వైరా** కొణిజర్లలో ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలో సైతం ధాన్యం కొనుగోలు నేటి వరకూ జరగలేదు. నియోజకవర్గంలో అత్యధికంగా 13చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు.



'ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. కొర్రీలు లేకుండా చివరి గింజ వరకూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. సన్నవడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ కూడా వస్తుంది.'
**- కె.శేఖర్‌రెడ్డి, చింతకాని పీఏసీఎస్ ఛైర్మన్**

☛ వనంవారికిష్టాపురంలో రైతు వేదికకు వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు, పిచ్చి చెట్లు దట్టంగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకవచ్చారు. సమస్యను ఎంపీఓ వాల్మీకి కిషోర్ దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు ద్వారా జేసీబీతో పిచ్చిచెట్లు సోమవారం తొలగించారు.

**స్పందనకు వందనం**

☛ ముదిగొండలోని ఒకటో వార్డులో పగలే వీధిదీపాలు వెలుగుతున్నాయంటూ స్థానికులు సోమవారం 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ నూతన విద్యుత్తు వైరు ఏర్పాటు చేసి పగటి పూట వీధిదీపాలు వెలగకుండా చర్యలు తీసుకున్నారు.
– ముదిగొండ, న్యూస్‌టుడే

## ఊరుపేరు తెలిసేదెలా?



ఈ చిత్రం చూశారా.. గ్రామాన్ని తెలిపే బోర్డు పూర్తిగా పిచ్చికంప మధ్యంలో పడిపోయింది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఉన్న గార్లఒడ్డును సూచించే బోర్డు ఇది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు గ్రామం తెలిసేలా ఉన్న బోర్డు పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. కొత్తగా వచ్చే వారికి ఆలయ దారి తెలిసే ఏర్పాటుచేసినా ఫలితం లేదని అంటునారు. ఈ విషయంపై ర.భ. ఏఈ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించగా బాగు చేయిస్తామన్నారు. – ఏన్కూరు, న్యూస్‌టుడే

## ఇలా ఉంటే నీరు పారేదెలా?



మధిర, బోనకల్లు మండలాల్లో పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాజెక్టు జాలిముడి. రెండు మండలాల్లో మొత్తం 4,900 ఎకరాల విస్తీర్ణం సాగవుతుంది. మధిర మండలంలో ఎడమ కాల్వ ద్వారా 2742 ఎకరాలు, బోనకల్లు మండలంలో కుడి కాల్వ ద్వారా 2,158 ఎకరాలు సాగు చేస్తున్నారు. పంట కాల్వల్లో తుంగ పేరుకపోవటంతో ప్రవాహం ముందుకు సాగటం లేదు. దీంతో పొలాలకు పూర్తి స్థాయిలో నీరు చేరటం లేదు. చెత్తాచెదారం కూడా పేరుకపోవటంతో నీరు ముందుకు కదలటం లేదు. ఈ విషయమై ఐబీ ఏఈ శాంతిశ్రీ మాట్లాడుతూ కాల్వలో సిల్టును తొలగిస్తున్నామని పూర్తి స్థాయిలో నీరందిస్తామన్నారు. – మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

## ఆశలు నేలవాలుతున్నాయ్..!



ఉదయం సమయంలో ఎండ.. మధ్యాహ్నం దాటిన తరువాత వర్షం.. ఇలా వారం రోజులుగా మండలంలో విచిత్ర వాతావరణం నెలకొంది. రెండు రోజులుగా మధ్యాహ్న సమయంలో కురుస్తున్న వర్షాలకు కోతలకు సిద్ధమైన వరి నేలవాలి పోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తేమ శాతం ఎక్కువగా ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు. – పెనుబల్లి, న్యూస్‌టుడే

## కొణిజర్లలో భారీ వర్షం

**కొణిజర్ల:** మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం సమయంలో గంట పాటు ఏకధాటిగా వర్షం పడింది. రహదారి కనపడకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. గ్రామాల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. పొలాల్లో నీరు పారింది. ఉరుములు, మెరుపులతో భయాందోళనకు గురిచేసింది.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**చింతకాని:** చిన్నమండవ మున్నేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను జగన్నాధపురం సమీపంలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

## తీవ్ర గాయాలు

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు అయ్యప్ప దీక్షధారులు గాయపడ్డారు. ఎర్రుపాలెం మండలం రామాపురానికి చెందిన సురేష్, తమ్మి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి అయ్యప్పస్వామి ఆలయంలో మాల ధరించేందుకు సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై వచ్చారు. అనంతరం జాతీయరహదారిపై ఇంటికెళ్తున్న క్రమంలో పశ్చిమ బైపాస్ వద్దకు వచ్చే సరికి వ్యతిరేక మార్గంలో ప్రయాణిస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సురేష్, తమ్మిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 'శాతవాహన' నిలుపుదలకు వినతి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సమస్య విన్నవిస్తున్న హనుమంతరావు

**ఎర్రుపాలెం, న్యూస్‌టుడే:** ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రయాణికుల సంఘం వాసిరెడ్డి హనుమంతరావు ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హైదరాబాద్‌లో సోమవారం వినతి పత్రం అందించారు. శాతవాహన నిలిపితే జమలాపురం శ్రీవారి భక్తులకు, ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పి.లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, రామిరెడ్డి, అన్వర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## భారాస నాయకుల రాస్తారోకో

**చింతకాని, న్యూస్‌టుడే:** రైతు భరోసాను తక్షణమే వానాకాలం పంటకు అమలు చేయాలని కోరుతూ చింతకానిలో భారాస నాయకులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

**మధిర గ్రామీణం, న్యూస్‌టుడే:** మాటూరు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు మేడిశెట్టి మహాలక్ష్మి, చిలువేరు జయశ్రీ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావటంతో వారిని సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ వై.ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయులు చెరుకుపల్లి శ్రీహరి, పీడీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థినులతో ఎంఈఓ వై.ప్రభాకర్, ఉపాధ్యాయులు

## పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

**ముదిగొండ, న్యూస్‌టుడే:** మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు బీసీ కులగణనపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్, ఏఎస్ఓ సుమన్‌లు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా కాశయ్య

**చింతకాని, న్యూస్‌టుడే:** నాగులవంచ శ్రీరామ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలకమండలి ఎన్నిక సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా ఇమ్మడి కాశయ్య, కార్యదర్శిగా బి.తిరుపతిరావు, కమిటీ సభ్యులుగా పరిటాల పద్మ, చిర్రా భారతమ్మ, అమరబోయిన పుల్లారావు, యరదేశి రవి, తోట లక్ష్మణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పీహెచ్‌సీకి బెడ్ వితరణ

**పెనుబల్లి, న్యూస్‌టుడే:** యడ్లబంజర్‌కు చెందిన హర్షిత, తన తల్లి పద్మశ్రీ జ్ఞాపకార్థం లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.20 వేల బెడ్‌ను సోమవారం వైద్యాధికారి చింతా కిరణ్‌కుమార్‌కు అందించారు. అనంతరం దాత యడ్ల వెంకటేశ్వరరావును సన్మానించారు. డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**వేంసూరు, న్యూస్‌టుడే:** లక్ష్మీనారాయణపురం(కొత్తూరు) గ్రామంలో 15 నిరుపేదల కుటుంబాలు ఇళ్లు లేక తాత్కాలిక రేకుల షెడ్లు, తాటాకు ఇళ్లలో ఉంటున్నారని, వారికి తొలుత ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఐ మండల కార్యదర్శి పిల్లి భాస్కర్ కోరారు. లక్ష్మీనారాయణపురంలో సమస్యాత్మక ఇళ్లను సోమవారం పరిశీలించి మాట్లాడారు.

## 'అర్హులందరికీ పరిహారం అందించండి'

**మధిర, న్యూస్‌టుడే:** గత నెలలో తుపాన్‌తో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక బోడేపూడి భవన్‌లో సోమవారం పార్టీ మండల కమిటీ సమావేశం ఊట్ల శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడదపై ఫిర్యాదు

**వేంసూరు, న్యూస్‌టుడే:** వేంసూరులో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రజలపై దాడులు చేస్తున్నాయని, ఇళ్లలో బీభత్సం సృష్టిస్తున్నాయని సోమవారం ప్రజావాణిలో తహసీల్దారు ఎంఏ రాజుకు ఫిర్యాదు చేశారు.

**నివాళి: తల్లాడ, న్యూస్‌టుడే:** రామానుజవరం మాజీ సర్పంచి శీలం కోటారెడ్డి తండ్రి తండ్రి నాగిరెడ్డి దశదినకర్మ సోమవారం నిర్వహించారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హాజరై నాగిరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. నారాయణపురం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి దశదినకర్మకూ ఎంపీ హాజరయ్యారు.

## పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఆర్ రెహమాన్

**మధిర:** వార్షిక తనిఖీల్లో భాగంగా మధిర పట్టణ పోలీస్ స్టేషన్‌ను వైరా ఏసీపీ ఏఆర్ రెహమాన్ సోమవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, సీసీ కెమేరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న నేర విచారణలో పురోగతిని తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. పట్టణ ఎస్సై సంధ్య, పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

**సత్తుపల్లి, న్యూస్‌టుడే:** స్థానిక బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం డాక్టర్ మట్టా దయానంద్ విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వెంకటేశ్వరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకురాలు దారా ప్రమీల ఆర్థిక సాయంతో 250 మంది విద్యార్థులకు వీటిని అందించినట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధికి ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రూ.లక్ష సాయం అందిస్తామని ప్రకటించారు. ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

✦ ఎంబీబీఎస్ సీటు సాధించిన పెనుబల్లి మండలం కర్రాలపాడుకు చెందిన జీనుగు నిశాంత్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం సత్కరించారు. సత్తుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.


ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ మట్టా దయానంద్

## మౌలాలికి టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డు

**కల్లూరు, న్యూస్‌టుడే:** అక్టోబరు 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పేరువంచ ఉన్నత పాఠశాలకు చెందిన గణితం ఉపాధ్యాయుడు ఎండీ మౌలాలి టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డును దక్కించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శారదా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పురస్కారం అందించారు. ప్రేరణ తరగతులతోపాటు ఉపాధ్యాయులకు అనేక వృత్యంతర శిక్షణలు అందించిన మౌలాలీ సేవలకు గుర్తింపు ట్రస్ట్, స్కైలైఫ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ అవార్డును ట్రస్ట్ ఛైర్మన్ మనోహర్ చేతుల మీదుగా అందుకున్నారు.



హైదరాబాద్‌లో టీచర్ ఎక్స్‌లెన్స్ పురస్కారం అందుకుంటున్న మౌలాలీ

## కొణిజర్ల- తనికెళ్ల రహదారికి నిధులు మంజూరు

**కొణిజర్ల, న్యూస్‌టుడే:** కొణిజర్ల నుంచి తనికెళ్ల వరకు గల 4 కి.మీ రహదారికి రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు మంజూరుకు కృషి చేసినందుకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచి సూరంపల్లి రామారావు, ఇతర నాయకులు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సోమవారం కలిసి సన్మానించారు. నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, రేపాల వెంకటి, కొలిపాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సన్మానిస్తున్న సూరంపల్లి

## చేయని పనులకు బిల్లులంటూ నిరసన

**వైరా, న్యూస్‌టుడే:** మున్సిపాలిటీ పరిధిలో చేయని పనులకు సైతం అధికార పార్టీ ఒత్తిళ్లతో బిల్లులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సీపీఎం, భారాస ఆధ్వర్యంలో పుర కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. పదో వార్డు గండగలపాడులో ఇలా బిల్లులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆందోళన చేపట్టారు. చేయని పనులకు బిల్లులు ఇచ్చేదిలేదని కమిషనర్ చింతా వేణు స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, భారాస పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, దొంతెబోయిన గోపి, ఇమ్మడి సుధీర్, సుంకర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.


వైరా: పుర కార్యాలయం వద్ద సీపీఎం, భారాస నాయకుల ధర్నా

## అనుమతుల్లేని నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

**వైరా, న్యూస్‌టుడే:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న దొంతెబోయిన చింతయ్య కాంప్లెక్స్ వద్ద పదో వార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని, హనుమంతరావు దంపతులతోపాటు ఇతర కాంగ్రెస్ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. నాలుగో వార్డు పరిధిలో ఇదే భవనాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించారని చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజు చేరుకుని అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించి విరమింపచేయించారు. కౌన్సిలర్ నందిని ఆధ్వర్యంలో కమిషనర్ చింతా వేణుకు వినతిపత్రం అందించారు. భవనం విషయంలో చర్యలు తీసుకోవాలని, పదో వార్డులో సుధీర్, కృష్ణ అనుమతులు లేకుండా స్థిరాస్థి వెంచర్ వేశారని ఆరోపిస్తూ వినతి పత్రం అందించారు.


భవనం వద్ద కౌన్సిలర్ కర్నాటి నందిని ధర్నా

## పోలీస్ అమరవీరుల దినోత్సవం


అమరుల స్తూపానికి గౌరవ వందనం సమర్పిస్తున్న కమాండెంట్ ఛటర్జీ తదితరులు

**సత్తుపల్లి, న్యూస్‌టుడే:** గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో సోమవారం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. స్తూపానికి కమాండెంట్ పీజేపీసీ ఛటర్జీ, ఇతర అధికారులు గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్డీ రంగారెడ్డి, ఉద్యోగులు, కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

**కారేపల్లి, న్యూస్‌టుడే:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కారేపల్లిలో సోమవారం నిర్వహించారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.


ఠాణా వద్ద అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎస్సై రఫీ, సిబ్బంది

**ఏన్కూరు, న్యూస్‌టుడే:** అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏన్కూరులో ఎస్సై మహ్మద్ రఫీ నివాళి అర్పించారు. స్టేషన్, ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య, సిబ్బంది సైదా, శ్రీను, శంకర్, రవి పాల్గొన్నారు.

# వంతెన నిర్మిస్తే దూరం తగ్గినట్టే..

మధిర-మైలవరం రహదారి పూర్తయినా ప్రారంభానికి నోచని బ్రిడ్జి పనులు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే

ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తే దాదాపు 15 కి.మీ. దూరం తగ్గుతుంది. రెండు రాష్ట్రాలను కలిపే అనుసంధాన రహదారి అది. మధిర నుంచి ఏపీలో మైలవరాని పట్టణానికి రహదారి నిర్మించేందుకు నిధులు మంజూరు కావటంతో నెలల క్రితమే పూర్తిచేశారు. కానీ కట్లేరుపై అనుసంధాన వంతెన పనులు ఇంతవరకూ ముట్టుకోకపోవటంతో ప్రతిపాదిత ప్రయోజనం నెరవేరటం లేదు. భూసేకరణ సమస్యే ఇందుకు ప్రధాన కారణం.

మధిర-ఎర్రుపాలెం ప్రధాన రహదారిలోని నిధానపురం నుంచి సఖినవీడు, రాజులదేవరపాడు గ్రామాల మీదుగా బుచ్చిరెడ్డిపాలెం సమీపంలోని మైలవరం రహదారికి అనుసంధానంగా రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భారాస ప్రభుత్వం పీఎంజీఎస్‌వైలో భాగంగా రూ.10.5 కోట్లు మంజూరు చేశారు. మే, 5, 2022న అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావులు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రారంభమైన నెలల వ్యవధిలోనే గుత్తేదారు కట్లేరుకు ఇరువైపులా తారు రోడ్డు నిర్మించారు. ఇది జరిగి దాదాపు రెండేళ్లు కావస్తున్నా సఖినవీడు-రాజులదేవరపాడు గ్రామాల మధ్యన కట్లేరుపై వంతెన పనులు ప్రారంభం కాలేదు. ఇది పూర్తయితేనే ప్రతిపాదిత లక్ష్యం నెరవేరుతుంది.


కట్లేరు వరకు నిర్మించిన తారు రోడ్డు


కట్లేరులో వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

### సమస్య ఏంటి?

సఖినవీడు- రాజులదేవరపాడు మధ్యన కట్లేరుపై వంతెన నిర్మాణానికి ఇరువైపుల అప్రోచ్ రోడ్డుకు రైతుల నుంచి భూసేకరణ చేయలేదు. గతంలో పనులు దక్కించుకున్న గుత్తేదారు టెండర్ రద్దు చేశారు. మళ్లీ ఐదు ఎకరాల మేర భూసేకరణకు, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. నిధులు మంజూరై, మళ్లీ టెండర్ పిలిస్తేనే పనులు ప్రారంభమవుతాయి. ఈ సమస్యపై పంచాయతీరాజ్ శాఖ ఈఈ గుర్రాల వెంకటరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... ఐదు ఎకరాల భూసేకరణకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు కోరామన్నారు. నిధులు మంజూరవగానే టెండర్‌లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

# ఖమ్మం
• ఖమ్మం • పాలేరు

## 'ప్రజావాణి'కి ప్రత్యేక కేంద్రాలు: కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో తమ సమస్యలు చెప్పుకొనేందుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఆయా విభాగాల సిబ్బందితో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. నగరపాలకంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. జనన మరణాలు, రెవెన్యూ, చేయూత పింఛన్లు, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కార్యాలయంలో అందరికి అందుబాటులో ఉండేలా వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పలువురు మున్నేరు వరద బాధితులు తమకు సొమ్ములు అందలేదని, తమ పేర్లు జాబితాల్లో లేవని కమిషనర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి స్పందించిన ఆయన వారి వివరాలు తీసుకొని విచారణ చేయాలని ఆదేశించారు.


కమిషనర్ అభిషేక్ అగస్త్యకు గోడు వెళ్లబోసుకుంటున్న మున్నేటి వరద బాధితులు

## సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లాలో సోమవారం భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు ప్రారంభించింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని గుర్రాలపాడులో ఏర్పాటు చేసిన కేంద్రంలో తొలిరోజు 9 మంది రైతులకు చెందిన 269 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీం ఒక ప్రకటనలో తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

**సమస్య:** పంపింగ్ వెల్ రోడ్డు నుంచి కాల్వొడ్డు వరకు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమల వ్యాప్తి పెరిగింది. - **గిరిధర్**

**సమాధానం:** పరిశీలించి శుభ్రం చేయిస్తాం.
- సాంబయ్య, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

# సర్వే చేసి లెక్కలు తేలుస్తారు

**నమూనాగా 43వ డివిజన్ ఎంపిక**
**ప్రతిపాదనను పరిశీలించిన కమిషనర్**

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఖమ్మం నగరంలో అనేక మంది ఆస్తి పన్ను చెల్లింపుల విషయంలో అధికారులను పక్కదోవ పట్టించడం, కొంతమంది సిబ్బంది చేతివాటం కారణంగా నగరపాలకం రూ.కోట్లాది ఆదాయాన్ని కోల్పోతోంది. ఈ నేపథ్యంలో నగరంలో ఉన్న ప్రస్తుత నిర్మాణాలు, యజమానులు తీసుకున్న అనుమతులకు సంబంధించి సర్వే నిర్వహించడం ద్వారా పన్ను ఎగవేతదారులు బయటపడటంతోపాటు, ఆదాయం పెరిగే అవకాశం ఉందని మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య భావించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో సర్వే చేసిన ఓ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో సంస్థ ప్రతినిధులు సోమవారం కమిషనర్‌ను తమ ప్రణాళిక వివరించారు. దాన్ని పరిశీలించిన ఆయన సర్వే చేపట్టేందుకు ఆమోదముద్ర వేశారు.


ప్రైవేటు ఏజెన్సీ ప్రతినిధులతో చర్చిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్‌ఓ శ్రీనివాసరావు

నగరపాలక సంస్థలో 60 డివిజన్లు ఉండగా ఒకేసారి అన్ని డివిజన్లలో కాకుండా వ్యాపార, సాధారణ నివాసాలు అధికంగా ఉన్న 43వ డివిజన్‌ను నమూనా డివిజన్‌గా ఎంపిక చేశారు. డివిజన్‌లో ప్రతి ఇంటిని గూగుల్ మ్యాప్స్ ద్వారా సర్వే నిర్వహిస్తారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలు, దానికి సంబంధించిన అనుమతులు, ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తి పన్ను వివరాలు ఈ సర్వే ద్వారా సేకరించనున్నారు. ఇందుకోసం ఏజెన్సీకి అవసరమైన సిబ్బందిని సమకూర్చాలని కమిషనర్, ఆర్‌ఓ శ్రీనివాసరావుకు సూచించారు.

**పరిశీలించిన కమిషనర్** ప్రైవేటు ఏజెన్సీ చేసిన ప్రతిపాదనలను సోమవారం కమిషనర్ పరిశీలించారు. నమూనాగా 43 డివిజన్‌లో ఏజెన్సీ ప్రతినిధులు సర్వే చేసేందుకు అవసరమైన చర్యల తీసుకోవాలని రెవెన్యూ, ప్రణాళిక విభాగం సిబ్బందిని కమిషనర్ సూచించారు. రెండు, మూడు రోజుల్లో సర్వే ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.


అధికారులకు సూచనలిస్తున్న సీఈ విద్యాసాగర్

## నిర్మాణ పనుల పరిశీలన

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరు పాత కాల్వ యూటీ ప్రాంతంలో చేపట్టిన రక్షణ గోడ నిర్మాణ పనులను జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్ సోమవారం పరిశీలించారు. పాత కాల్వ యూటీ ప్రాంతంలో ఇటీవల గండి పడిన విషయం తెలిసిందే. గండి పూడ్చివేతతో పాటు, కట్ట పటిష్ఠతకు కాంక్రీట్‌తో గోడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. పరిశీలించిన సీఈ విద్యాసాగర్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. ప్రధాన కాల్వ గండి పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు.

## గతుకుల రహదారికి అతుకులు

ఈనాడు కథనానికి స్పందన

కూసుమంచి, న్యూస్‌టుడే: సూర్యాపేట-ఖమ్మం రహదారిలో పాలేరు కాజ్‌వేపై గతుకులతో తీవ్ర అసౌకర్యంగా ఉన్న రహదారిని అధికారులు సోమవారం బాగు చేశారు. సెప్టెంబరులో పాలేరు వరదతో ధ్వంసమైంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో 'ఈనాడు'లో సోమవారం 'గతుకుల రహదారికి.. అతుకు వేసేదెన్నడో..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు బీటీ సమకూర్చి చదును చేశారు.

## అథ్లెటిక్స్‌లో జిల్లాకు ఏడు పతకాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో జిల్లాకు ఆరు పతకాలు లభించినట్లు జిల్లా క్రీడల అధికారి టి.సునీల్‌రెడ్డి సోమవారం తెలిపారు. రన్నింగ్ అండర్-20లో ఎస్.గోపిచంద్ రెండు రజతాలు, లాంగ్‌జంప్ అండర్-16లో బి.వైశాలి రెండు బంగారు పతకాలు, 600 మీటర్ల రిలే అండర్-16లో కె.మస్తాన్ రెండు రజత పతకాలు, అండర్-18లో ఎస్‌కె.అఫ్రిన్ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులను, కోచ్ ఎండీ గౌస్‌ను ఆయన అభినందించారు.

## ఆర్థికసాయం అందజేత


నేలకొండపల్లి, న్యూస్‌టుడే: నేలకొండపల్లికి చెందిన ద్విచక్రవాహన మెకానిక్ కందికొండ నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. స్పందించిన మెకానిక్‌ల సంఘం నరేశ్ భార్యకు రూ.25వేల నగదును సోమవారం ఆర్థికసాయంగా అందించారు. సంఘం అధ్యక్షుడు వంగాల కొండలరావు, శివాకృష్ణ, ఎండీ జాకీర్, లింగన్న, మురళి పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందించిన నాయకులు

★ 'దాతలు స్పందిస్తే'.. ఆ ఊరిలో తొలి వైద్యుడు' శీర్షికన నాలుగు రోజుల క్రితం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. సందిపోగు దిలీప్‌కుమార్ సుర్దేపల్లికి చెందిన వైద్య విద్యార్థి శ్రీపతికి రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు.

## దారంతా మురుగు గుంత

నగరంలోని పలు కాలనీల్లో మురుగు కాలువ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం 7వ డివిజన్ శ్రీలక్ష్మీనగర్‌లో మురుగు కాలువ వ్యవస్థ లేదు. దీంతో స్థానికులు వీధుల్లోనే గుంతలు ఏర్పాటు చేసి మురుగు తరలిస్తున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి అవి దోమలకు ఆవాసాలుగా మారాయి. నగర పాలక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే



## పేదలపై పోలీసుల దమనకాండను ఖండిస్తున్నాం: ఓపీడీఆర్

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం నగర శివారు వినోభా నవోదయ కాలనీలోని పేద ప్రజల నివాసాల్లో పోలీసులు సోదాలు చేయడం, బెదిరించి కేసులు నమోదు చేయడం వంటి పాశవిక దమనకాండను ఖండిస్తున్నట్లు ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థ(ఓపీడీఆర్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జతిన్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటీ నాయకులు నవోదయ కాలనీలో సోమవారం పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన ఉద్యమ భూమి 62 ఎకరాల 7 గుంటల్లో 11 ఏళ్లుగా పేదలు హక్కులు సంపాదించుకుని ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు వీరికి కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు. మంచినీరు, కరెంటు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా సమస్యలు పరిష్కరించడంలో కలెక్టర్, స్థానిక రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సమావేశంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, స్వతంత్ర కార్మిక సంఘాల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఎస్.ఎన్.మూర్తి, ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.విజయేందర్‌రావు, కె.వెంకటేశ్వర్లు, బోయిన వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జతిన్ కుమార్

## 'జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: మూడేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన బోధనా రుసుములు, ఉపకార వేతనాలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 'చలో కలెక్టరేట్' కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులతో కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. నాయకులు లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ధర్నాచౌక్ వద్ద జరిగిన సభలో ఆజాద్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.6,500 కోట్ల బోధనా రుసుములు, ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కలెక్టరేట్‌లో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేశ్, నాయకులు వినయ్, చంద్రశేఖర్, పృథ్వీ, సందీప్, ప్రసాద్, అనిత, కావ్య, దీప్తి, యశ్వంత్, స్టాలిన్, మల్సూర్, సాయి, కరుణ, వీణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపల్ పార్వతిరెడ్డి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన చెస్, బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ఆర్.పార్వతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చెస్.. అండర్-14 బాలికల విభాగంలో ఎ.హిమశ్రీనిక ప్రథమ, అండర్-17 బాలుర.. వి.సత్యప్రణవ్ ప్రథమ, బి.రుత్విక్ ద్వితీయ, బి.శశాంక్ తృతీయ స్థానాలు సాధించారన్నారు. బాస్కెట్ బాల్ అండర్-14 లో కీర్తి స్వప్నిక, కార్తిక చుమయి, ఎస్.చైత్ర, తన్మయి, బి.జీవన్‌శ్రీ, నష్టాఈన్, బాలుర.. పి.సాయికౌశిక్, డి.ఉజ్వల్, ఎండి.గౌస్ అస్లాం.. అండర్-17 బాలికల్లో జోషిత, దర్శిని, నీతూశీతల్, హన్సీ, జె.దీక్షిత, ఐశాని, బాలుర.. ఎం.చేతన్, పి.లోహిత్ అక్షయ్ రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

## ఇన్‌స్పెక్టర్‌కు అస్వస్థత

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల దినోత్సవ వేడుకల సందర్భంగా ఖమ్మం మూడో పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్ అస్వస్థతకు గురయ్యారు. అమరవీరుల స్తూపానికి అందరూ నివాళులర్పించే సమయంలో ఆయన కళ్లు తిరిగి పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలించారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న ఇన్‌స్పెక్టర్ రమేశ్‌ను వైద్యులు ఇంటికి పంపించారు. రెండు రోజులుగా స్వల్ప జ్వరంతో బాధపడుతున్న ఆయన నీరసంగా ఉండటంతో కళ్లు తిరిగి పడిపోయినట్లు తెలుస్తోంది. ఆయనను పలువురు పోలీసు అధికారులు పరామర్శించారు.


రమేశ్‌ను తరలిస్తున్న పోలీసులు

## పూర్వ విద్యార్థుల మాటామంచ్చట

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని కత్తుల వీరమ్మ మెమోరియల్ స్కూల్(కేవీఎం) పూర్వ విద్యార్థుల సమ్మేళనం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం నిర్వహించారు. 1975 నుంచి 1979 వరకు పాఠశాలలో చదివిన అనేక మంది పూర్వ విద్యార్థులు సమావేశమై నాటి తమ మధురానుభూతులు పంచుకున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత అంతా ఒకచోట చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులైన కస్తూరి, దానమణి, పుష్పలత, ఆరోగ్యం, సావిత్రి, కమత, మార్తమ్మ, ధనమ్మలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కత్తుల అరుణ, మల్లాది విజయభారతి, రోజానా, కళావతి తదితరులు పాల్గొన్నారు.


ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య: కలెక్టర్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సభ్యులతో సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో రెండు పాఠశాలల ల్యాబ్‌లు దత్తత తీసుకున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 800 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాడిశెట్టి కృష్ణ మాట్లాడుతూ... ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు కంప్యూటర్ విద్య అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాడిశెట్టి శ్రీజ, ఫౌండేషన్ సభ్యులు మాధవి, మరియెన్ పాలి, వంశీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీజ

### ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల బీమా: కలెక్టర్

ఆటో డ్రైవర్ల కుటుంబాలకు భరోసా కల్పించేలా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు మెరుగైన జీవనం పొందేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రతి డ్రైవర్ ఏడాదికి రూ.500 చెల్లించి రూ.5 లక్షల ప్రమాద బీమా పొందవచ్చన్నారు. జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, కార్మిక సంఘాల ప్రతినిధులు నరేశ్, మోహన్, ఉపేందర్, శ్రీను, కృష్ణ, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల్లో గ్రామసభలు

కామేపల్లి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం 15వ సామాజిక తనిఖీలో భాగంగా ముచ్చర్ల, తాళ్లగూడెం, జొగ్గూడెం, భాసిత్‌నగర్, పొన్నెకల్ పంచాయతీల్లో గ్రామ సభలను సోమవారం నిర్వహించారు. ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి తప్పులు తడకలుగా మస్టర్లలో నమోదు, కొలతలలో తేడాలు, ఇతర అంశాలను సిబ్బంది గ్రామసభల్లో చదివి వినిపించారు. ఏపీవో శ్రీరాణి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూనంనేని పరామర్శ

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దతండాకు చెందిన చల్లపల్లి శ్రీను తల్లి రాధమ్మ ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం పరామర్శించారు. పార్టీ జిల్లా నాయకుడు పుచ్చకాయల కమలాకర్ పాల్గొన్నారు.

## ముందస్తు నిర్బంధం

కామేపల్లి, న్యూస్‌టుడే: లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అజ్మీరా సుశీలబాయి డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కామేపల్లి పోలీసులు సుశీలబాయితోపాటు పలువురి నాయకులను సోమవారం ముందస్తుగా నిర్బంధించారు.

## ఆర్థిక సాయం అందజేత

కామేపల్లి, న్యూస్‌టుడే: వెంకట్యాతండాకు చెందిన గుగులోత్ హరికిషన్ ఉన్నత చదువుల నిమిత్తం లండన్ వెళ్లారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటికి తిరిగి వచ్చారు. తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. యునైటెడ్ కింగ్ డమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 40వేల నగదును మండల ఠాణాలో ఎస్సై సాయి కుమార్ చేతులమీదగా హరికిషన్‌కు సోమవారం అందజేశారు. కానిస్టేబుళ్లు రమేశ్, సీతారాములు, అంజయ్య, శంకర్ పాల్గొన్నారు.

## పాఠశాలల సందర్శన

కూసుమంచి, న్యూస్‌టుడే: పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా చదువులో వెనకబాటును గుర్తించి పాఠశాల స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కె.రవికుమార్ సూచించారు. కూసుమంచి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలతో పాటు గోరీలపాడుతండా, పెరికసింగారం ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం సందర్శించారు.

## పిడుగుపాటుతో జీవాల మృతి

కామేపల్లి, న్యూస్‌టుడే: పిడుగుపాటుకు ఐదు జీవాలు మృతి చెందిన ఘటన పండితాపురంలో సోమవారం చోటు చేసుకుంది. కొండారెడ్డి చెరువు సమీపంలో మేత కోసం జీవాలను తీసుకెళ్లారు. పిడుగుపడటంతో ఆరు అక్కడికక్కడే మృతి చెందాయి.

## అమరులకు నివాళి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు నేలకొండపల్లి ఠాణాలో ఎస్సై సంతోష్ అంజలి ఘటించారు. హెడ్ కానిస్టేబుల్స్ సీతారాములు, హనుమంతరావు, లక్ష్మి, పాల్గొన్నారు.

## తెదేపా సభ్యత్వ నమోదుకు ఆహ్వానం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాల్సిందిగా విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ తెదేపా ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావును ఖమ్మం తెలుగు తమ్ముళ్లు ఆహ్వానించారు. కేతినేని హరీశ్‌చంద్ర, చింతనిప్పు నాగేశ్వరరావు, కర్నాటి సీతారాములు, బైరు అప్పారావు, నాగండ్ల లక్ష్మణ్, కూచిపూడి జై, తాళ్లూరి నారాయణరావు, లెనిన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల పనులు వేగవంతం: రఘురాంరెడ్డి

ఖమ్మం కమాన్ బజార్, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీ రఘురాం రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎన్‌హెచ్ఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాగపూర్ - అమరావతి, సూర్యాపేట-జంగారెడ్డి గూడెం, ఖమ్మం- కొరివి రహదారులను కలుపుతూ ఖమ్మం రింగ్‌రోడ్డు ఏర్పాటు కానుందని అధికారులు వివరించారు. సూర్యాపేట-జంగారెడ్డి గూడెం మార్గంలో సర్వీస్ పాయింట్లపై చర్చించారు.


మ్యాప్‌ను పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న లోక్‌సభ సభ్యుడు రఘురాంరెడ్డి

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: జల్లేపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రేఖ ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జల్లేపల్లిలో సోమవారం దశదిన కర్మకు రఘురాంరెడ్డి, రాయల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సు తరగతులు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సు తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ రాజేశ్వరరావు తెలిపారు. కళాశాలలో సోమవారం తల్లిదండ్రులు, విద్యార్థులతో ఫౌండేషన్ కోర్సు ఆఫ్ డే ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వైద్య విద్యకు సిద్ధం చేశారు. ప్రీ క్లీనికల్, పారా క్లీనికల్ ప్యాకల్టీని పరిచయం చేశారు. వైఎస్ ప్రిన్సిపల్ సరిత, వివిధ విభాగాలకు చెందిన హెచ్ఓడీలు పాల్గొన్నారు.

## అనుమతిలేని నిర్మాణం కూల్చివేత

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని 34వ డివిజన్‌లో గోళ్లపాడు కాలువ బఫర్ జోన్‌లో నిర్మించిన ఇంటిని నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం సిబ్బంది సోమవారం కూల్చివేశారు. నిర్మాణ విషయమై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ నిర్మాణదారు స్పందించకపోవడంతో కూల్చివేతకు నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ తరుణంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇంటిని పాక్షికంగా కూల్చిన అధికారులు నిర్దేశించిన సమయంలో మిగిలిన నిర్మాణాన్ని తొలగించాలని సూచించారు.


గోళ్లపాడు బఫర్ జోన్‌లో నిర్మించిన ఇంటిని కూల్చివేస్తున్న నగరపాలక సిబ్బంది

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. కల్లూరు మండలం కిష్టారానికి చెందిన వి.వెంకటేశ్వరరావు(20) తన బైక్‌పై ఆదివారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామంలోని స్నేహితుని ఇంటికి వెళ్లారు. తిరిగి వస్తూ మార్గమధ్యలో కాచిరాజుగూడెం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనకనుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వరరావు ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై గువ్వలగూడెం వద్ద సోమవారం రహదారి ప్రమాదం చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట గ్రామానికి చెందిన లింగరాజు, వెంకటేశ్వర్లు ఖమ్మం వైపు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఆటో వారి వాహనాన్ని ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రుల్ని ఖమ్మం ప్రధానాసుపత్రికి తరలించారు.

## రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు పర్యటన

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: వి.వెంకటాయపాలేనికి చెందిన విశ్రాంత ఉద్యోగి రాపర్తి ప్రసాద్‌రావు ఇటీవల మృతి చెందారు. ఆయన ఇంటిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం సందర్శించారు. ప్రసాద్‌రావు చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.


ప్రసాద్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం కార్పొరేషన్: వీడీఓస్‌కాలనీలో అయ్యప్ప స్వాములకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, తాండ్ర మంజుల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.

★ కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డకు చెందిన దీప్తిని వద్దిరాజు రవిచంద్ర అభినందించారు. శాలువా కప్పి సత్కరించారు.

## కాలిన కాయం. కావాలి సాయం!



ఒళ్లు కాలిపోయి, ఓ కాలు కోల్పోయిన ఈ అబ్బాయి పేరు పెంటల భరత్. ఖమ్మం గ్రామీణ మండలం సాయిగణేష్‌నగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. కొన్ని నెలల క్రితం ఇంటిపైన కోతులను ఇనుప చువ్వతో తరుముతుండగా విద్యుత్తు తీగలకు తగిలి భరత్ ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స కోసం సుమారు రూ.14 లక్షలకు పైగా ఖర్చు చేశామని, ఇప్పుడు వైద్యమందించే స్థోమత లేదని అతడి తల్లి శోభ తెలిపారు. ప్రస్తుతం నెలకు రూ.15 వేలు ఖర్చవుతోందని, ప్రభుత్వం స్పందించి భరత్‌కు వైద్యమందించాలని, తమకు జీవనోపాధి కల్పించాలని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అధికారులను వేడుకున్నారు.

- ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం నగరం

## వివాహిత అదృశ్యం

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యమైన సంఘటనపై రఘునాథపాలెం పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. రఘునాథపాలెం గ్రామానికి చెందిన ఓ వివాహిత ఈనెల 18న భర్తతో ఘర్షణ పడింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా సమాచారం లభించకపోవడంతో భర్త రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఎన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.